ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

జగిత్యాల జిల్లా వార్తలు
5★★
బుధవారం 26 జూన్ 2024

వన మహోత్సవానికి వేళాయె.. 8లో
ప్రజాస్వామ్యానికి చీకటి రోజు ఎమర్జెన్సీ 8లో

- హైద్రాబాద్‌కు తరలివెళ్లిన జీవన్‌రెడ్డి, అనుచరులు
- జీవన్‌రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి భేటీ
- పదవికి రాజీనామాకు జీవన్‌రెడ్డి సిద్ధం
- స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో వెనక్కితగ్గిన ఎమ్మెల్సీ
- కాంగ్రెస్‌లో చల్లారని అసంతృప్తి జ్వాల


ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో భేటీ అయిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

రాజధానికి మారిన రాజకీయం

జగిత్యాల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల కాంగ్రెస్ రాజకీయం రాజధానికి మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడాన్ని తప్పు పడుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యక్త పరచిన అసంతృప్తి ఇంకా చల్లార లేదు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో భేటీ అయినా అసంతృప్తి వీడని ఎమ్మెల్సీ తన వ్యూహానికి మరింత పదును పెట్టారు. రాష్ట్ర రాజధానిలో తమ అసంతృప్తిని వ్యక్తం చేయాలని నిర్ణయించుకున్నారు. సోమవారం అర్ధరాత్రి హైద్రాబాద్‌కు వెళ్లారు. హైద్రాబాద్‌లోని తన నివాసాన్ని కేంద్రంగా చేసుకొని తనదైన రాజకీయం ప్రారంభించారు. దీంతో రెండు, మూడు రోజులుగా జగిత్యాల కేంద్రంగా నడిచిన కాంగ్రెస్ రాజకీయం హైద్రాబాద్‌కు మారింది.

జీవన్‌రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి భేటీ...

హైద్రాబాద్‌లోని బేగంపేట ప్రాంతంలోని ప్రకాశ్‌నగర్‌లో గల ఎమ్మెల్సీ నివాసానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెళ్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాటిపర్తి జీవన్ రెడ్డిని కలిశారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లతో కలిసి జీవన్‌రెడ్డితో సుదీర్ఘ సమయాన్ని కేటాయించి మాట్లాడారు. జీవన్‌రెడ్డితో అభిప్రాయాలను పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో గతంలో మాదిరిగానే సరియైన ప్రాధాన్యత ఉంటుందని, అసంతృప్తిని విడనాడాలని బుజ్జగించే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. సుమారు రెండు గంటల పాటు ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులు పలు విధాలుగా ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. ఒక సందర్భంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి మంత్రి పదవిని సైతం ఆఫర్ చేసినట్లుగా ప్రచారం జరిగింది. అయినప్పటికీ ససేమిరా అని సమాధానం ఇచ్చిన ఎమ్మెల్సీ అసంతృప్తి వీడలేదని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి.

జీవన్‌రెడ్డికి దీపాదాస్ మున్షీ కాల్...?

అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఫోన్ ద్వారా సంప్రదించినట్లు కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా వ్యవహారంపై వెనక్కు తగ్గాలని సూచించినట్లు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో పరిస్థితి చక్కబడుతుందని సూచించినట్లు సమాచారం.

కాంగ్రెస్‌లోనే ఉంటా...

జగిత్యాల కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలతో తాను అసంతృప్తిగా ఉన్నానని, మనస్తాపానికి గురై ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి నిర్ణయించుకున్నట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు. అయితే పదవికి రాజీనామా చేసినా కాంగ్రెస్‌ను వీడేది లేదని, పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.

స్పష్టమైన హామీకి జీవన్ అభిమానుల డిమాండ్...?

రాజకీయ భవిష్యత్‌పై స్పష్టమైన హామీనివ్వాలని జీవన్‌రెడ్డి అభిమానులు డిమాండ్ చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. మరికొన్ని సంవత్సరాలు ప్రజా జీవితంలో గడిపే విధంగా జీవన్‌రెడ్డికి అవకాశం కల్పించాలని కార్యకర్తలు, అనుచరులు డిమాండ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. జీవన్‌రెడ్డి సీనియారిటీకి తగ్గట్టుగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉన్నతమైన స్థానంలో ఉండే విధంగా కాంగ్రెస్ అవకాశం కల్పించాలని కోరుతున్నట్లుగా వినిపిస్తోంది. అయితే ఈ డిమాండ్‌పై అటు జీవన్‌రెడ్డి గానీ, ఇటు కార్యకర్తలుగానీ బహిరంగంగా అభిప్రాయాన్ని ఇప్పటివరకు వ్యక్త పరచలేదు.

రాజీనామాకు జీవన్‌రెడ్డి సిద్ధం

జగిత్యాల కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో జీవన్‌రెడ్డి తాను ప్రాతినిత్యం వహిస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమయ్యారు. శాసన మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డికి రాజీనామా పత్రం సమర్పించడానికి సిద్ధమైనా మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో కొంత వెనక్కు తగ్గినట్లుగా తెలుస్తోంది. ఈ అంశాన్ని హైద్రాబాద్‌లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్వయంగా మీడియా కు ప్రకటించారు. ప్రస్తుతం మండలి చైర్మన్ అందు బాటులో లేనందున్న తాత్కలికంగా రాజీనామా వాయిదా వేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఈనెల 26వ తేదీన ఉద యం 10 గంటలకు రాజీనామాను సమర్పించడానికి మండలి చైర్మన్ అపాయింట్‌మెంట్‌ను తీసుకున్నట్లుగా సమాచారం.

జీవన్‌రెడ్డి గౌరవానికి భంగం కలగనివ్వం...
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టీకరణ

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గౌరవమర్యాదలకు ఎలాంటి భంగం కలగనివ్వమని, పార్టీ తప్పని సరిగా ఆయనను గౌరవిస్తుందని, ఆయన ఆలోచనలను పరిగణలోకి తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైద్రాబాద్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో భేటీ అయిన అనంతరం పలు వివరాలను వెల్లడించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సుదీర్ఘ అనుభవాన్ని పార్టీ వినియోగించుకుంటుందని, జీవన్ రెడ్డిని వదులుకోవడానికి కాంగ్రెస్ సిద్ధంగా లేదని స్పష్టం చేశారు.

కార్యకర్తలతో అభిప్రాయాల సేకరణ...

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి మద్దతుగా జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలతో పాటు నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి వందల సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో హైద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో ఎమ్మెల్సీ అభిప్రాయాల సేకరణ జరిపారు. ఒక్కో ప్రాంతం నుంచి వచ్చిన కార్యకర్తలకు పిలుపించుకొని భవిష్యత్ కార్యాచరణపై తీసుకోవాల్సిన నిర్ణయాలను చర్చించారు. కార్యకర్తల మనోభావాలను అడిగి తెలుసుకున్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ


మెట్‌పల్లిలో విచారణ చేపట్టిన డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, ఎస్సై చిరంజీవి

మెట్‌పల్లి, జూన్, 25 : పట్టణానికి చెందిన ఎమ్‌డీ హకీం, నరేష్, సద్దాం, మనోజ్, మారుతిలపై ఇటీవల ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయ్యింది. దీంతో సంబంధిత కేసుపై మంగళవారం పట్టణంలోని కోదండ రామాలయం వద్ద డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, ఎస్సై చిరంజీ విచారణ చేపట్టారు. పట్టణానికి చెందిన కుంబాల గణేష్ సొంత ఊరు ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తిలో ఉన్న భూమి విషయంలో అన్నదమ్ముల మధ్య కొన్ని రోజుల నుంచి తగాదా జరుగుతోంది. గణేష్‌కు రావలసిన సగభాగం భూమి కోసం పలువురిని సంప్రదించారు. అదే సమయంలో ఎమ్‌డీ హకీం, మారుతి జోక్యం చేసుకొని తమకు రాజకీయ అండదండలు ఉన్నాయని, అధికారులు తెలుసని భూమి ఇప్పించి రిజిస్ట్రేషన్ చేయిస్తామని నమ్మబలికారు. దీనికి రూ. 20లక్షలు ఖర్చు అవుతాయని గణేష్ నుంచి వారు మొదటగా రూ. 12లక్షలు తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా భూతగాదా పరిష్కారం కావడం లేదని తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని గణేష్ భార్య సుమలత అడిగింది. దీంతో వారు సుమలతను కులం పేరుతో దూషించి బెదిరింపులకు పాల్పడినారని మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఐదుగురిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదైంది. ఈ కేసు విషయమై విచారణ చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. విచారణ చేపట్టిన వారిలో ఎస్సై చిరంజీవి, సిబ్బంది ఉన్నారు.

గడువులోగా సీఎంఆర్ అప్పగించకుంటే చర్యలు

అదనపు కలెక్టర్ రాంబాబు


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

జగిత్యాల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన నిర్ణీత గడువులోగా సీఎంఆర్‌ను అప్పగించకుంటే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వానాకాలం 2022-23 సీజన్‌కి చెందిన సీఎంఆర్ బకాయి పడ్డ మిల్లర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2024 జూన్ 26వ తేదీ నాటికి పాతికశాతం అపరాద రుసుముతో సివిల్ సప్లయికి సరాఫరా చేయడానికి గడువు ముగుస్తుందన్నారు. నిర్ణీత గడువులోగా సీఎంఆర్‌ను చెల్లించాలని ఆదేశించారు. లేనియెడల సంబంధిత మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా మేనేజర్ హతీరాం, సివిల్ సప్లయి డిపార్ట్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది, సీఎం ఆర్‌లో డిపాల్ట్‌గా గుర్తించబడ్డ రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతికి నివాళులు


శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు, మిత్రులు

జగిత్యాల అర్బన్, జూన్ 25: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బద్రి శ్రీరాములు మృతి పట్ల ఆయన మిత్రులు, పలు పార్టీల నాయకులు మంగళవారం స్థానిక తహశీల్‌చౌరస్తా వద్ద కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. కౌన్సిలర్‌గా పనిచేసిన కూడా ఎలాంటి దర్పం ప్రదర్శించకుండా తన వృత్తిని నమ్ముకొని సాదాసీదా జీవనం గడిపిన వ్యక్తి శ్రీరాములు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆ కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనారోగ్యం బారిన పడి మృతి చెందిన శ్రీరాములు కుటుంబానికి ఆర్థిక చేయూతను అందించాని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌లు గాజుల నగేష్, ఏసీఎస్ రాజు, అర్బన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ అక్కినపల్లి కాశీనాథం, నాయకులు భూమయ్య, అంజన్న, వెంకట్‌రెడ్డి, చుక్క గంగారెడ్డి, బాలన్న, శ్రీనివాస్, రాజలింగం, సంతోష్, అరుణ్‌కుమార్, బిట్టు తదితరులున్నారు.

మత్తు వదులుదాం..

- నేడు అంతర్జాతీయ మారకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం

జగిత్యాల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): 'మత్తు వదలరా, ఆ మత్తులో పడితే గమ్మత్తుగా చిత్తవుదువురా' అని ఓ సినీ కవి రాసినట్టుగా యువత పెడదారి పడుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాలు మదకద్రవ్యాల అక్రమ రవాణాకు కేంద్ర బిందువులుగా మారాయని సంబంధిత వర్గాలు అంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్నం తదితర ప్రాంతాల నుంచి గంజాయి, ముంబాయి, పుణే, హైద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి డ్రగ్స్ జగిత్యాల జిల్లాకు రవాణా అవుతున్నట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అఫ్ఘనిస్తాన్, మయన్మార్, కొలంబియా, మెక్సికో, పాకిస్తాన్‌తో పాటు ఇండియాను మాదక ద్రవ్య వాణిజ్య కూడలిగా గతంలో పలు సందర్భాల్లో అభివర్ణించారు. పలు దేశాలు ఎక్కడికక్కడ ఉచ్చు బిగిస్తుండడం వల్ల పలు మత్తు వ్యవస్థలు ప్రస్తుతం భారత్ వైపు అందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి తెలుగు రాష్ట్రాల వైపు దృష్టి సారిస్తున్నట్లు విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ప్రతీ యేటా జూన్ 26వ తేదీన అంతర్జాతీయ మారకద్రవ్యాల దుర్వినియోగం అండ్ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ప్రభుత్వం జరుపుతూ ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రయత్నిస్తోంది.

● యువతలో ఎక్కువ..

యుక్త వయస్సులో ఉన్నప్పుడే కొందరు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తుంటారు. కొత్త ప్రయోగాలతో ప్రమాదాలు తెచ్చుకుంటుంటారు. ఎక్కువగా ఇలాంటి సమయంలో మత్తు పదార్థాలకు అలవాటు పడుతుంటారు. ఆడ మగా అని తేడా లేదు అమ్మాయిలు కూడా మత్తుకు బానిసలవుతున్నారు. ఒక్కసారి అలవాటు పడితే మత్తు ముంచివేస్తోంది.. దీని బారిన పడి ఎంతో మంది చిక్కులో పడుతున్నారు. తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.



● తల్లిదండ్రుల పట్టింపులేక..

తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం, ఉద్యోగ, ఉపాధి సమస్య వంటివి యువత మత్తుకు అలవాటు పడేందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ఇంట్లో గొడవలు, పెంపకంలో లోపాలు, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికి అలవాటు ఉండడం పిల్లల్ని మత్తు పదార్థాల వైపు చూసేలా చేస్తున్నాయి. జిల్లాలో మత్తు పదార్థాలను సరఫరాలను నియంత్రిండంలో అధికార యంత్రాంగం దృష్టి సారించినా వారి కళ్లు గప్పి మత్తు మాఫియా తమ వ్యాపారాలను కొనసాగిస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, పట్టించుకొని మత్తు పదార్థాల బారిన యువత పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది.

అవగాహన కల్పించాలి

డాక్టర్ సమియొద్దిన్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో



యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పించడానికి అన్ని వర్గాలు ప్రయత్నం చేయాలి. పలు సందర్భాల్లో యువత మత్తుకు ఆకర్శితులై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఇటువంటి వారిని గుర్తించి అవగాహన కల్పించి చెడు వైపు దృష్టి సారించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కలెక్టర్‌ను కలిసిన టీడీపీ నాయకులు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

జగిత్యాల, జూన్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సత్యప్రసాద్‌ను జిల్లా టీడీపీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాధ్యులు సోమ నారాయణరెడ్డి, అక్కినపల్లి కాశీనాథం, కొండ శ్రీధర్, ఓరుగంటి భార్గవ్‌రామ్, రామకృష్ణయ్య, బత్తుల కొండయ్య, జున్ను మల్లయ్య తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి అండ

మల్యాల, జూన్ 25: మండలంలోని లంబాడిపల్లికి చెందిన గడ్డం జలంధర్‌గౌడ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు గ్రామస్థులు ఆర్థికంగా అండగా నిలిచారు. గ్రామస్థులు రూ.66766, గల్ఫ్‌లో ఉన్న లంబాడిపల్లి వాసులు రూ.25200 మృతుడి కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు. గ్రామస్తులకు, గల్ఫ్‌లో ఉన్న వారికి బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ సత్యప్రసాద్


వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల, జూన్ 25 : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే వారిని స్వయంగా కలిసి వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓపీ పెషెంట్ల వివరాలను రికార్డులను పరిశీలించి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ వివరాలను పరిశీలన జరిపి ల్యాబ్‌లో చేస్తున్న పరీక్షలపై ఆరా తీసారు. అదే విధంగా సివిల్ సప్లై గోదాంను పరిశీలించి అందులో ఉన్న నిలువల రికార్డును పరిశీలించారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతంమైన ప్రకాశం రోడ్డులోని పలు ప్రాంతాలను పరిశీలించారు. కంచర కుంట చెరువు సామర్థ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోన డ్రైనేజీ వ్యవస్థ సరిగా ఉండి వర్ష కాలంలో ఇబ్బందులు కలుగ కుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల ఆర్‌డీవోలు సంపత్‌రావు, ఆనంద్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ తిరుపతి, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో రామకృష్ణలతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి

కోరుట్ల రూరల్ : గ్రామాల్లో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ గ్రామస్థాయి అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని మోహన్‌రావుపేట, మాదాపూర్, పైడిమడుగు గ్రామాలలోని గ్రామ పంచాయతీలు, రైస్ మిల్లులు, నర్స రీలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గ్రామ పంచాయతీలో ఉన్న రికార్డులను పరిశీలించి గ్రామ ప్రత్యేక అధికారులకు పలు సూచనలు సలహాలను అందించారు. వర్షకాలంలో పారిశుధ్య పనులపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామలలో మిషన్ భగీరథ ద్వార తాగు నీటి సరఫరా జరుగుతున్న విషయం తెలుసుకున్నారు. మాదపూర్ గ్రామ శివారులోని రైస్ మిల్లును తనిఖీ చేశారు. మొక్కల పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల అర్‌డీవో సంపత్‌రావు, ఆనంద్ కుమార్, తహసీల్దార్ ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో నీరజలతో పాటు ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

మల్యాల, జూన్ 25: పంట పెట్టుబడి సాయం కోసం ప్రభుత్వం అమలు చేయనున్న రైతుభరోసా విధివిధానాల రూపకల్పనలో భాగంగా మంగళవారం రైతుల నుంచి వ్యవసాయ అధికారులు అభిప్రాయాలు సేకరించారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు ఎన్ని ఎకరాల వరకు, ఎంత మేర ఆర్థిక చేయుత ఇస్తే లబ్ధి చేకూరుతోందో రైతుల నుంచి అభిప్రాయాలను రాత పూర్వకంగా తీసుకున్నారు. అనంతరం ముత్యంపేట శివారులో గౌతంరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో పచ్చి రొట్ట విత్తనాలు వేశాక కలియదున్నడంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వాణీ, మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి మండల వ్యవసాయ అధికారులు చంద్రదీపక్, జ్యోతి, వినీల ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు

కంకర వేశారు... తారు మరిచారు

● ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు

శంకరపట్నం, జూన్ 25: శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి గ్రామం నుంచి మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామం వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనుల్లో భాగంగా కంకర వేసి తారు మరిచారు. గ్రామాల రోడ్డును జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తూ కేంద్ర ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టింది. రోడ్డు నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 2023లో పనులు ప్రారంభించారు. మొదటి విడత నిధులతో పాత రోడ్డు తొలగించి కొత్త రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. అందులో భాగంగా ఎరడపల్లి నుంచి గంగిపల్లి వరకు కంకర వేసి పనులు నిలిపివేశారు. ఈ దారి గుండా మానకొండూర్ మండలంలోని పలు గ్రామాలకు, వీణవంక మండలంలోని పలు గ్రామాలకు పదుల సంఖ్యలో వాహనాలు నిత్యం రాకపోకలు జరుపుతుంటాయి. సంవత్సర కాలంగా కంకర రోడ్డుపై ప్రయాణించిన పలువురు వాహనదారులు వాహనాలపై నుంచి పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. పాత రోడ్డు తొలగించి కొత్త రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


కంకర వేసి వదిలివేసిన ఎరడపల్లి-గంగిపల్లి రహదారి

దళిత కాలనీలో వెలగని వీధి దీపాలు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గంగాధర, జూన్ 25: గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి దళిత కాలనీలో ఇవ్వై రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. గ్రామాధికారికి, విద్యుత్ అధికారులకు పిర్యాధు చేసిన మాదికాంంటే మాదికాదంటు తప్పించుకుంటున్న అధికారులు. గత ఇరవై రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పిడుగు పాటడంతో దళిత కాలనీలోని వీధి దీపాలు వైర్లతో పాటు బల్బులు కిందపడ్డయి. గ్రామపంచాయతీ సిబ్బంది పది రోజులుగా తిరుగుతున్న సమస్య గుర్తించలేకపోయారు.గ్రామసిబ్బంది కేవలం వీధి ధీపాలు పోతే తొంర్పడం తప్ప కరెంటు సమస్య తెలువదని వాపోతున్నారు. ఇన్సులేటర్లు పలిగి లేదా వైర్లు ఎక్కడైన అల్లుకుని ఈవిధమైన సమస్య వస్తుందని గ్రామ పంచాయతీ హెల్పర్ అంటున్నారు. వారం రోజుల క్రితం ఈ సమస్యనుతెలిపిన విద్యుత్ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదు. దళిత కాలనీలో వీధి ధీపాల కనెక్షన్ పునరుద్దరణ చేస్తే వీధి దీపాలు ఎక్కడెక్కడ పోయాయో అమర్చుతామని సిబ్బంది తెలుపుతున్నారు.గత కొన్ని రోజులుగా వీధి దీపాలు లేక కుక్కల, విషపురుగుల బెడదతో కాలనీవాసులు బయటికి వెల్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వీధి దీపాలు లేక దొంగల భయం పట్టుకుందని అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను గుర్తించి సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.


విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


భోజనశాలను పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి, జూన్, 25: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలురుల పాఠశాల, మెట్లచిట్టాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు కల్పించిన సదుపాయాలు, విద్యబోధన, భోజనం, హాస్టల్ వసతులను, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా లేదా అని, హాస్టల్ సదుపాయాలు ఎలా ఉన్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ఉన్న విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బాలికలు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని, క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి వసతిగృహానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించి, అక్కడ చదువుతున్న వారితో కాసేపు మాట్లాడి అవసరమైన పుస్తకాలు ఉన్నయాని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో విద్యార్థులు, నిరుద్యోగులకు, ప్రవేశ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారికి అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రంథాలయం చుట్టు పరిశుభ్రంగా ఉంచాలని, గ్రంథాలయంకు ఎమైనా అవసరాలు ఉంటే దృష్టి తీసుకరావాలని సూచించారు. ఈయన వెంట ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఆరేళ్ల రాజాగౌడ్, పాలేపు రాజాగంగారం, నాయకులు ఉన్నారు.

అంగడిలో అడ్డగోలు వసూళ్లపై విచారణ ఏది..?

● రసీదు బుక్‌లపై ఆరా తీసిన కమిషనర్



జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం

జమ్మికుంట, జూన్ 25: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పశువుల అంగడిలో అడ్డగోలు వసూళ్లపై ఆంధ్రజ్యోతి అనుబంధంలో కథనం ప్రచురితం అయిన విషయం తెలిసిందే. స్పందించిన మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులతో సమావేశం అయ్యారు. అంగడి ప్రారంభమై మూడు నెలలు కావస్తుంది, పూర్తి అయిన రశీద్ బుక్‌లు ఎందుకు వెనక్కి తీసుకోలేదు, పశువుల క్రయ విక్రయదారుల వద్ద గుత్తేదారు ఎంత వసూళ్లు చేస్తున్నారు, ఎప్పటికప్పుడు తనిఖీలు ఎందుకు చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మంగళవారం అంగడి ఉండటంతో మొదట విచారణ చేపట్టాలని బావించినట్లు తెలుస్తోంది. కానీ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు అంగడి వద్దకు వెళ్లేందుకు సాహసం చేయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు అమాయకులైన క్రయ విక్రయదాలరులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాల్సిన అవసరం ఉంది.

29న సదరం స్లాట్ బుక్ చేసుకోవాలి

సుభాష్‌నగర్, జూన్ 25: జిల్లా ఆసుపత్రిలో జూలై, ఆగస్టు నెలలో నిర్వహించే సదరం శిబిరంలో పాల్గొనేందుకు ఈ నెల 29న 11.30 నుంచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 3న ఆర్థో, జూలై 9న మానసిక, 15న కంటి చూపు, 23న వినికిడి, మూగ వారికి సంబందించిన సదరం శిబిరం నిర్వహిస్తారన్నారు. ఆగస్టు 6న ఆర్థో, 13న మానసిక, 20న కంటి చూపు, 27న వినికిడి, మూగ వారికి సంబందించిన వారికి శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. సంబందిత వైద్య పత్రాలు, మీసేవలో బుక్ చేసుకున్న రశీదుతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో సదరం శిబిరానికి హజరు కావాలని సూచించారు.

29న కొండగట్టుకు పవన్‌కళ్యాణ్

మల్యాల, జూన్ 25: ఏపీ డిప్యూటీ సీఎం, సినీ నటుడు పవన్‌కళ్యాణ్ ఈ నెల 29న కొండగట్టుకు రానున్నట్లు తెలిసింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడంతో పవన్‌కళ్యాణ్ కొండగట్టుకు వచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారని ఆయన అభిమానులు పేర్కొన్నారు. గత ఏడాది జనవరి 24న పవన్ కొండగట్టులో పర్యటించి ఏపీలో ఎన్నికల ప్రచారానికి వినియోగించిన నూతన వాహనం వారాహికి పూజలు నిర్వహించారు. అటు తరువాతే ఏపీలో ప్రచారం మొదలు పెట్టడం, ఎన్నికల్లో పోటీ చేసిన వాటిలో మొత్తం గెలుపొందడంతో కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధికి వచ్చి పవన్‌కళ్యాణ్ పూజలు నిర్వహిస్తారని తెలుస్తోంది. డిప్యూటీ సీఎం హోదాలో పవణ్‌కళ్యాన్ కొండగట్టుకు రానున్నట్లు సమాచారం రావడంతో పవన్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.

ఆర్టీసీ బస్సు.. బొలెరో వాహనం ఢీ

● బొలెరో ప్రయాణిస్తున్న ఇద్దరి మృతి ● బస్సులోని ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలు

ధర్మారం, జూన్ 25: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద రాష్ట్ర రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం డ్రైవర్ అన్వర్ పాషా(25), మరొక వ్యక్తి అబ్బల్(55) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల డిపోకు చెందిన ఏపీ29జడ్ 2622 ఆర్టీసీ బస్సు మంచిర్యాల నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా, ఏపీ 28టిఎ8726 బొలెరో వాహనం ఎదురుగా వస్తూ ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద ఆర్టీసీ బస్సును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బొలెరో వాహన డ్రైవర్ అన్వర్(25), అబ్బల్(55) అనే ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. వాహన డ్రైవర్‌ది హైదరాబాద్ పరిధి ముషీరాబాద్‌లోని ఇందిరానగర్‌కు చెందిన వ్యక్తి. అబ్బల్ గోదావరిఖనిలోని లక్ష్మీనగర్‌కు చెందిన వ్యక్తి అని గుర్తించారు. బొలెరో వాహనంలో ఇద్దరి మృతదేహాలు ఇరుక్కుని ఉండడంతో గ్యాస్ కట్టర్‌లతో కట్ చేసి బయటకు తీయాల్సి వచ్చింది. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఉమాదేవి, ఆగవ్వ అనే మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన


ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద ఢీకొన్న బొలెరో, ఆర్టీసీ బస్సు

స్థలానికి పెద్దపల్లి సీఐ కృష్ణ, ఎస్సై సత్యనారాయణ చేరుకుని ఘటన వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం కరీంనగర్ తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పించండి

● రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కమిషనర్‌కు గర్షకుర్తి చేనేత సంఘం నాయకుల వినతి

గంగాధర, జూన్ 25: బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పించాలని గర్షకుర్తి చేనేత సంఘం నాయకులు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మంగళవారం గంగాధర మండలం గర్షకుర్తి చేనేత వర్తక వ్యాపార సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ చేనేత, జౌళిశాఖ కమిషనర్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల తరువాత మినీ సిరిసిల్లగా పేరున్న గర్షకుర్తిలో మరమగ్గాలు, చేనేత రంగంపై అనేక మంది కార్మిక కుటుంబాలు ఆధారపడ్డాయని కొన్ని సంవత్సరాలుగా ఉపాధి పొందుతూ జీవనం గడుపుతున్నారన్నారు. ఆరు నెలలుగా పనిలేక ఇతర పనులు చేయలేక కుటుంబాలు గడ్డుకాలం వెల్లదీస్తున్నాయన్నారు. గర్షకుర్తి చేనేత మరమగ్గాలకు బతుకమ్మ ఆర్డర్లు ఇప్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గర్షకుర్తి చేనేత వర్తక వ్యాపార సంఘం అధ్యక్షుడు అలువాల విరోభ, అన్నల్ దాస్ శ్రీనివాస్, గుండ రాజేశం, వెంకటాద్రి, అలువాల తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ


ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, జూన్ 25: కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరగా అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అంజన్న దర్శనం అనంతరం భక్తులు బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతా లు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

అవమానభారంతో మహిళ ఆత్మహత్య

● న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల రాస్తారోకో

హుజూరాబాద్, జూన్ 25: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మోతె అఖిల (31) అనే మహిళకు వివాహేతర సంబంధం అంటగట్టి దాడి చేయడంతో అవమానంతో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయంపై రెండురోజుల క్రితం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మృతురాలి బంధువులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ధర్నాను విరమింపజేశారు. మృతురాలి భర్త జలేందర్ తెలిపిన ప్రకారం..ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నాగరాజు, ఆయన భార్య ఉమ, తిరుమల, రాజ్‌కుమార్‌లు తన భార్యకు అక్రమ సంబంధం అంటగట్టడంతో తన భార్య అఖిల ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు పట్టించుకోలేదన్నారు. తాము వ్యవసాయ బావులన్నీ వెతుకగా రాజిరెడ్డి బావిలో అఖిల మృతదేహం లభించిందని తెలిపారు. దీనిపై పోలీసులకు


హుజూరాబాద్‌లో ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

ఫిర్యాదు చేసినా అవమానించిన వ్యక్తులకే పోలీసులు వత్తాసు పలుకుండడంతో ధర్నా చేశామన్నారు. ఇప్పటికైనా పోలీసులు న్యాయం చేయాలన్నారు. ఈ సంఘటపై అఖిల భర్త జలేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి


బైరి సతీష్(ఫైల్)

కోల్‌సిటీ, జూన్ 25: గోదావరిఖని గాంధీనగర్‌లో నివాసముండే బైరి సతీష్(32) అనే వ్యక్తి భార్య కాపురానికి రావడం లేదనే మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. సతీష్ ప్రైవేట్ ఉద్యోగి. 2020లో అతనికి హారి కతో వివాహం జరుగగా మూడు సంవత్సరాల కూతురు ఉంది. భార్యభర్తల మధ్య వివాదాలతో విడాకులకు కోర్టును ఆశ్రయించారు. తన భార్య తిరిగి కాపురానికి వస్తానని చెప్పి, మళ్లీ తన వద్దకు రావడం లేదనే మనస్థాపంతో ఈ నెల 2న పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్‌ఐ సమ్మయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి ఆత్మహత్య

కథలాపూర్, జూన్ 25: మండలంలోని సిరికొండలో మంగళవారం ఫిరదౌస్ (26) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. రాయికల్ మండల కేంద్రానికి చెందిన ఫిరదౌస్ కొన్నేళ్ల కిందట సిరికొండకు ఇల్లరికం వచ్చాడు. భార్య ఫిరదౌసీతో కొద్ది రోజులుగా మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. గొడవలు జరుగుతున్న క్రమంలో వారం రోజుల కిందట ఫిరదౌస్ రాయికల్ వెళ్లాడు. సిరికొండ-కోరుట్ల రహదారి మధ్యలో ఉన్న మామిడితోటలో ఫిరదౌస్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి బాషామియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపినట్టు తెలిపారు. కాగా పోలీసులు తనను వేధించారని ఫిరదౌస్ తన బంధువులకు వాట్సాప్ సందేశం పంపించినట్లు ప్రచారం జరుగుతోంది.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

రాయికల్, జూన్ 25: రాయికల్ పట్టణంలో రెండు రోజుల క్రితం 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. రాయికల్ పట్టణానికి చెందిన సింగు గంగనర్సయ్య టైలర్ వృత్తి చేసుకుంటూ జీవిస్తుంటాడు. తన షాపునకు బాలికను పిలిచి మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపామని చెప్పారు. ఇప్పటివరకు నిందితుడు పరారీలో ఉండగా, మంగళవారం పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీఐ వెంట ఏఎస్సై దేవేందర్, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసి బస్సుకు బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

పాలకుర్తి,జూన్ 25: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం అడ్డరోడ్డు వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సుకు బైకు ఢీకొన్న సంఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, అందుగులపల్లి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై హరీష్ కుర్మపల్లి వైపు వస్తుండగా ఢీకొన్నట్లు తెలిసింది.

పాత కక్షలతో హత్య


● ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

జగిత్యాల టౌన్, జూన్ 25: పాత కక్షల నేపథ్యంలో హత్యకు పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులకు జీవిత ఖైదు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 5వేల జరిమాన విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేంపేట గ్రామానికి చెందిన ధనరేకుల రాజేందర్‌కు అదే గ్రామానికి చెందిన జెల్ల రమేష్, జెల్ల మహేష్‌లకు మధ్య పాత కక్షలతో కేసులు నమోదయ్యాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఏలాగైనా రాజేందర్‌ను హత్య చేయాలని రమేష్, మహేష్‌లు 2020 మే 19న గ్రామ సమీపంలో కత్తులతో దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలైన రాజేందర్ అక్కడిక్కడడే మృతి చెందాడు. మృతుడి భార్య హరిణి మెట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రవి కుమార్, ఎస్సై సధాకర్ కేసు నమోదు చేశారు. నిందితులైన రమేష్, మహేష్‌లను కోర్టులో ప్రవేశ పెట్టారు. కోర్టు పోలీసులు రాజు నాయక్, కిరణ్ కుమార్, రంజిత్‌లు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలు అయిన రమేష్, మహేష్‌లకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. ముద్దాయిలకు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసుల అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

గృహిణి ఆత్మహత్య

రామగిరి, జూన్ 25: రామగిరి మండలంలోని సెంటినరీకాలనీకి చెందిన వి. శ్రీలక్ష్మి(46) మంగళవారం టాయిలెట్ క్లీనర్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం టాయిలెట్ క్లీనర్ తాగి అపస్మారక స్థితిలో ఉన్న శ్రీలక్ష్మిని కుటుంబ సభ్యులు గుర్తించి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. శ్రీలక్ష్మి మృతికి గల కారణాలు తెలియరాలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


పత్తి ప్రశాంత్ (ఫైల్)

కోరుట్ల రూరల్, జూన్ 25 : మండలంలోని పైడిమడుగు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మాదాపూర్ గ్రామానికి చెందిన పత్తి ప్రశాంత్ (27) మృతి చెందినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. సోమవారం సాయంత్రం సమయంలో మాదాపూర్ గ్రామానికి చెందిన పత్తి ప్రశాంత్ తన ద్విచక్ర వాహనంపై పైడిమడుగు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పైడిమడుగు గ్రామ శివారులో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్నట్లు తెలిపారు. తీవ్ర గాయాల పాలైన ప్రశాంత్‌ను గ్రామస్థుల సహకారంతో చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు బంధువులకు తెలిపారు. వెంటనే బంధవులు కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రశాంత్ తల్లి పోశాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తొమ్మిది వాహనాలను సీజ్ చేసిన ఎంవీఐ

హుజూరాబాద్, జూన్ 25: హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపు సమీపంలో మంగళవారం ఎంవీఐ వేణు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధిక లోడ్, సరైన పత్రాలు లేకపోవడంతో తొమ్మిది వాహనాలను సీజ్ చేసినట్లు ఎంవీఐ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారుడు పత్రాలు లేకుండా రోడ్లపైకి రావద్దన్నారు. అధిక మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పకుండా చేసుకోవాలన్నారు. రోడ్డుపై డ్రైవింగ్ నిబంధన లు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు

మల్యాల, జూన్ 25: మల్యాలకు చెందిన పెరుమల్ల సుమన్‌గౌడ్ అనే గీతకార్మికుడు ప్రమాదవశత్తూ తాటి చెట్టు పైనుంచి పడి గాయాలపాలయ్యాడు. తాటిచెట్టు ఎక్కి కిందకు దిగుతుండగా అదుపుతప్పడంతో కింద పడి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. కాగా చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

విభజన హామీల అమలుకు బీజేపీ ఎంపీలు కృషి చేయాలి

భగత్‌నగర్ (కరీంనగర్), జూన్ 25: రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎంపీలు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన సమయంలో యూపీఏ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందన్నారు. అనంతరం కేంద్రంలో ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయకుండా ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు తీరని అన్యాయం చేసిందన్నారు. బయ్యారం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ లాంటి హామీలు అమలు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓట్లు కొన్నిచోట్ల బీజేపీకి ట్రాన్స్‌ఫర్ అవడం వల్లనే ఆ పార్టీ అభ్యర్థులు గెలిచారన్నారు. తెలంగాణపై చిత్తశుద్ధి ఉంటే కేంద్ర మంత్రులు బండి సంజయ్‌కుమార్, కిషన్‌రెడ్డి విభజన హామీల అమలుకు కేంద్రపై ధైర్యంగా పోరాడాలన్నారు.సింగరేణిని ప్రైవేటీకరిస్తే


విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

చూస్తూ ఊరుకోబోమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

నేత కార్మికుడి ఆత్మహత్య


నరేశ్(ఫైల్)

తంగళ్లపల్లి, జూన్ 25: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీకి చెందిన ముదికొండ నరేష్ (34) అనే నేత కార్మికుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఇందిరమ్మకాలనీకి చెందిన నరేష్ గతలంలో వైపని కార్మికుడిగా పనిచేశాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. పని బంద్ చేసి జులాయిగా తిరిగేవాడు. గతంలోనూ మద్యం మత్తులో చేతి నరాలను బ్లేడ్‌తో కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చిన నరేశ్ ఇంట్లో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● మృతుడు నరేష్ కుటుంబాన్ని జిల్లా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు పడిగెల రాజు, కోడి


నరేష్ కుటుంబీకులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

అంతయ్య, ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, తాటికొండ చందు తదితరులు పరామర్శించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగిశెట్టి శ్రీనివాస్ పరామర్శించారు. రూ. 5 వేలు, చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీగాధ మైసయ్య రూ.2 వేలు ఆర్థికసాయం అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు గడ్డం మధుకర్, శ్రీరాం నరేష్, కొంపెల్లి శ్యామ్, బల్ల లక్ష్మీపతి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

డీఈఈ సెట్ 2024 నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, జూన్25: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో, ప్రైవేటు కళాశాలల్లో రెండు సంవత్సరాల కోర్సులైన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడి), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డిపిఎస్ఈ) మొదటి సంవత్సరములో 2024-25 విద్యా సంవత్సరంలో చేరుటకు నిర్వహించే డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదలైయినట్లు మండలంలోని ఎల్ఎండిలో గల డైట్ ప్రిన్సిపల్ శ్రీ రాంమొండయ్య తెలిపారు. ఈ కోర్సులో చేరుటకు ఇంటర్‌లో అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులు కలిగి ఉండాలని, షెడ్యూలు కులాల, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 45శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబరు1, 2024 నాటికి 17 సంవత్సరాలు ఉండాలని, గరిష్ఠ వయో పరిమితి లేదని తెలిపారు.

ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈ నెల 30వ తేదీలోగా సమర్పించాలని గడువు తేదీ సమీపి స్తున్నందున చివరి వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష 10.7.2024న ఉంటుందని, డీఈఎల్ఈడి కోర్సు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుదని, డిపిఎస్ఈ మాత్రమే ఆంగ్ల మాధ్యంలో ఉంటుందని అన్నారు. కోర్సును ఏ మాధ్యమంలో చేయాలనుకుంటే ఆ మాధ్యమంలోనే ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష రాయాలన్నారు. వివరాలకు డిఈఈసెట్-2024 వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 25: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,350 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు పది మంది రైతులు 167క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,350, కనిష్ఠ ధర రూ.6,900 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 9 మంది డీబార్

గణేశ్‌నగర్ జూన్ 25: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 9 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా వారిని డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు.రష్మిధర్ తేజ డిగ్రీ కళాశాల, కోరుట్లలో- ఒకరు, సంగమిత్ర కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, హుస్నాబాద్‌లో- ముగ్గురు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల, హుస్నాబాద్‌లో- ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుజూరాబాద్‌లో- ఇద్దరు, చాణక్య డిగ్రీ కళాశాల, జమ్మికుంటలో- ఒకరు,ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరిఖనిలో - ఒకరు. మొత్తం 9 మంది డీబార్ అయినట్లు తెలిపారు.

6న ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్,జూన్ 25 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరగనున్న ఎల్ఎల్‌బి ఆరవ సెమిస్టర్ పరీక్షలు జూలై ఆరవ తేదీ నుంచి పదో తేదీ వరకు జరగనున్నట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నట్లు తెలిపారు.

నా కొడుకును నాకు అప్పగించండి

● ప్రభుత్వాన్ని వేడుకుంటున్న తండ్రి

కరీంనగర్ క్రైం, జూన్ 25: తెలంగాణకు చెందిన ఓ బాలుడు బంగ్లాదేశ్‌లో చిక్కుకుపోయాడు. తన కొడుకును తనకు అప్పగించాలని తెలంగాణకు చెందిన ఆ బాలుడి తండ్రి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. బాధితుడు 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'కి తెలిపిన వివరాల ప్రకారం..వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన తిరుపతి 2016లో ఉపాధి కోసం ముంబైకి వెళ్లి అక్కడ మీరా రోడ్‌లో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసేవాడు. అతనికి అక్కడే రియా అనే బంగ్లాదేశ్ అమ్మాయి పరిచయమైంది. కొంతకాలానికి వారు పెళ్లి చేసుకున్నారు. ఇద్దరికీ కూడా ఇది రెండో వివాహం. గతంలో వారు పెళ్లిళ్లు అయి విడాకులు తీసుకున్నారు. వీరి ద్దరూ రెండో పెళ్లి చేసుకున్నాక 2017లో విశాల్ అనే కుమారుడు జన్మించాడు. కొంతకాలం తర్వాత రియా మరో అబ్బాయితో ప్రేమలో పడి అతనితో వేరే కాపురం పెట్టింది. దీంతో రియాకు, తిరుపతికి విడాకులు అయ్యాయి. వీరికి పుట్టిన బాబు రియా దగ్గరే ఉన్నాడు. మూడో భర్త తమ కుమారుడిని కొడుతున్నాడని బ్లాక్‌మె యిల్ చేసి పలుసార్లు తిరుపతిని డబ్బులు అడిగింది. చివరికి బాబు తనకు వద్దంటూ తిరుపతికి ఇచ్చేసింది. బాబును తీసుకొని తిరుపతి ముంబై నుంచి తెలంగాణకు వచ్చి మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. విడాకులు తీసుకున్నప్పటికీ రియా.. తిరుపతితో ఫోన్‌లో మాట్లాడుతూనే ఉంది. బాబును చూడాలని ఉందని రియా చెప్పడంతో నమ్మిన తిరుపతి బాబును తీసుకుని ముంబై వెళ్లాడు. అక్కడ తిరుపతిపై దాడి చేసి బాబును తీసుకుని రియా బంగ్లాదేశ్ వెళ్లింది. ముంబైలో తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. తర్వాత బంగ్లాదేశ్ నుంచి రియా బంధువులు తిరుపతికి వాట్సప్‌లో విశాల్‌ను హింసలు పెడుతూ


బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న తిరుపతి(ఫైల్)

తీసిన ఫొటోలు, వీడియోలు పంపిస్తూ డబ్బులు అడగడం ప్రారంభించారు. డబ్బులు పంపిస్తే బాబును పంపిస్తామంటున్నారు. దీంతో తిరుపతి ఇటీవల కరీంనగర్‌కు వచ్చి తన కుమారుడిని తనకు అప్పగించాలని కేంద్ర సహాయ హోంశాఖ మంత్రి బండి సంజయ్‌ని కలిసి విన్నవించాడు. మళ్లీ బండి సంజయ్‌ని కలిసేందుకు మంగళవారం తిరుపతి కరీంనగర్‌కు వచ్చిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి తన గోడును వివరించారు.


విశాల్

5జీ సిగ్నల్ రేడియేషన్‌పై అవగాహన ఉండాలి

● ఐఈఎస్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్


ఐఈఎస్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్

కొడిమ్యాల, జూన్ 25: 5జీ సిగ్నల్ రేడియేషన్‌పై ఇంజనీరింగ్ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఐఈఎస్ డైరెక్టర్ రీసర్చ్ పర్సన్ ఎ. శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాలలో ఈఎంఎఫ్ రేడియేషన్ అవేర్‌నెస్ 5జీ, డాట్ (డీవోటీ)స్కీంల గురించి. సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఈఎస్ డైరెక్టర్ సైబర్ సెక్యూరిటీ రీసర్చ్ పర్సన్ ఎ. శ్రావణ్‌కుమార్ టెలీగ్రాం సర్వీస్ ప్రొవైడర్ జి. రాఘవరెడ్డి, వి. రాజేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. మూడేళ్లలో తెలంగాణలో దొంగతనానికి గురైన మొబైల్స్ నుంచి 40 వేల మొబైళ్లను తిరిగి అప్పగించినట్లు తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 నెంబరుకు కాల్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై 32 లక్షల ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. ప్రభాకర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌చౌర్యం కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూన్ 25: విద్యుత్ చౌర్యానికి పాల్పడిన కేసులో చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన కొంకటి లక్ష్మణ్‌కు కరీంనగర్ కోర్టు జైలు శిక్ష విధించిందని ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా తెలిపారు. లక్ష్మణ్ 2019లో విద్యుత్ చౌర్యానికి పాల్పడగా కోర్టు ఆదేశాలతో జరిమానా చెల్లించాడన్నారు. మళ్లీ 2021లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ విజిలెన్స్ పోలీసులు తనిఖీల్లో పట్టుబడగా కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ మేరకు నిందితుడిని మంగళవారం కరీంనగర్ జిల్లా 1వ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ ఎదుట హాజరుపరచగా 52,944 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసేలా ఆదేశాలివ్వండి

- హైకోర్టులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన చెక్కుల గడువు ఈ నెల 27తో తీరిపోతున్నా వాటిని పంపిణీ చేయనివ్వడం లేదని.. వాటిని పంపిణీ చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని పేర్కొంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టింది. లబ్ధిదారులకు ఇప్పటికే జారీ అయిన చెక్కులను పంపిణీ చేయకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని పిటిషనర్ తరుపు న్యాయవాది పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. చెక్కుల పంపిణీ ఎలాంటి జాప్యం లేదని.. ఒకవేళ చెక్కుల గడువు తీరిపోయినా ప్రభుత్వం మళ్లీ జారీ చేస్తుందని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ నెల 27 నాటికి చెక్కుల కాలపరిమితి తీరిపోయే పక్షంలో పిటిషనర్‌కు అనుకూలంగా మధ్యంతర ఆదేశాలిస్తామని.. దీనిపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని పేర్కొంది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



వెల్లుల్లలోని ప్రభుత్వ పాఠశాలలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి రూరల్, జూన్, 25: మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం ఎంపీపీ మారు సాయిరెడ్డితో కలిసి పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల బోధన విధానం, విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయులను, సదుపాయాలు ఎలా ఉన్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ తరగతి గదుల్లో బోధించే ఉపాధ్యాయుల చేతుల్లో ఉంటుందని, అందుకు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన మంచి బోధన అందించాలన్నారు. విద్యార్థులలు కూడా విద్యా బుద్ధులు నేర్చుకొని జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. పాఠశాలలోని ఏమైన సమస్యలు ఉంటే నేరుగా తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో పేరెంట్ మీటింగ్ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంటా

ఉచిత శిక్షణ ఉపాధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్, జూన్ 25: మండలంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో జీఎంఆర్, ప్రతిమ ఫౌండేషన్ సయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణ ఉపాధి కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్, టైలరింగ్ (మహిళలకు), బెడ్ సైడ్ నర్సింగ్ కోర్సు (మహిళలకు), రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నాగారం శిక్షణ కేంద్రంలో ఫ్రంట్ ఆఫీస్ (ఎంఎస్ ఆఫీస్ కంప్యూటర్) కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు పదవ తరగతి పూర్తయి, 18 ఏళ్ల కలిగి ఉండాలని, ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 30వ తేదీలోపు 9963347142 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్ రాజ్ కుమార్

గొల్లపల్లి, జూన్ 25 : గ్లోబల్‌వార్మింగ్ ఉన్న ప్రస్తుత తరుణంలో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా కృషి చేయాలని ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం గొల్లపల్లి ఆదర్శ పాఠశాలలో పర్యావరణ హిత కార్యక్రమాలపై ఏకోక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే మొక్కలను నాటించడం, ఘన వ్యర్థ పదార్థాలను వేరు చేయడం, సేంద్రియ ఎరువుల తయారీ, వనరుల పొదుపు, నీటి సంరక్షణ, తదితర అంశాలపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. పాఠశాలల్లో, ఇంటి వద్ద ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, చెట్లను సంరక్షించాలని, మొక్కలను పెంచాలని ప్రిన్సిపాల్ విద్యార్థులకు సూచించారు. అనంతరం పర్యావరణ హిత కార్యక్రమాలపై పాఠశాల నుంచి స్థానిక అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడతామని విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కొంతం నగేష్, ఎన్‌జీసీ కన్వీనర్ పెద్దన్న, వ్యవసాయ వృత్తివిద్య అధ్యాపకులు జి. అభిషేక్, రమణ, రవి కుమార్, రమాదేవి, అర్చనతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

నగదు, బంగారం అపహరణ

ఇబ్రహీంపట్నం, జూన్ 25 : మండలంలోని మేడిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి దొంగలు రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. తాళం వేసిన ఉన్న ఇళ్లలో చొరబడి బంగారం, నగదు అపహరించినట్లు గ్రామస్థులు, పోలీస్‌లు తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జొరిగె శంకర్ దైవ దర్శనం నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి షిర్డీ యాత్రకు వెళ్లారు. అదే విధంగా జొరిగే అశోక్ తన స్వంత పనుల మీద ముంబాయి వెళ్లాడు. ఇళ్లకు తాళాలు ఉండటాన్ని గమనించిన నిందితులు సోమవారం రాత్రి తాళం పగులగొట్టి ఇంట్లో చొరబడ్డారు. ఇంట్లో ఉన్న దాదాపుగా 15 తులాల బంగారం 3 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ అనిల్ అక్కడకు చేరుకుని వివరాలను సేకరించారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. దొంగతనం జరిగిన పరిసర ప్రాంతాలను పోలీసు జాగిలాలతో ముమ్మరంగా గాలించారు. సమీపంలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. బాధితులు ఇంటి వద్ద లేకపోవడంతో నగదు, బంగారం ఎంత వరకు పోయిందో లెక్క తేలడం లేదు.

కార్మికుల సంక్షేమం మరిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ఐఎఫ్‌టీయూ ధర్నా

కోరుట్ల, జూన్ 25: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమం మరిచి పరిపాలన చేస్తున్నాయని ఐఎఫ్‌టీయూ నాయకులు అన్నారు. మంగళవారం కార్మికుల సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు చింత భూమేశ్వర్ మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పొట్టగొట్టే విధంగా పరిపాలనను అందిస్తున్నాయని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ సభ్యులు గంగాధర్, గంగారాం, రహీంలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజలతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే

మెట్‌పల్లి, జూన్, 25 : సామాన్యుడిలా పట్టణంలోని కార్యకర్తలు, ప్రజలతో కలిసి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ భోజనం చేశారు. మంగళవారం కోరుట్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి తిరిగి మెట్‌పల్లికి బయలు దేరారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలోని గంగారం మెస్ వద్ద అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు కన పడడంతో తన వాహనం నిలిపి పలకరించారు. వారి కోరిక మేరకు ఎమ్మెల్యే వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయి రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ కొరెపు రవి పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరు చేసివ్వాలి

కోరుట్ల, జూన్ 25 : పట్టణంలోని డంపింగ్ యార్డులో జరుగుతున్న బయో మైనింగ్‌ను మున్సిపల్ కమిషనర్ తిరుపతి మంగవారం పరిశీలించారు. యార్డులో తడి పొడి చేత్త వేరు చేసే విధనాన్ని పరిశీలించి చేసే విధానంలో పాటించే పద్ధతులను సిబ్బందికి వివరించారు. డంపింగ్ యార్డులలో చెత్తను ప్రాసెసింగ్ చేయ డం జరుగుతుందని అన్నారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి వేళాయె..

- నర్సరీల్లో పెరుగుతున్న 3 లక్షల మొక్కలు
- మండలంలో 2.87 లక్షలు మొక్కలు నాటడం లక్ష్యం

వెల్గటూర్, జూన్ 25: రాష్ట్రంలో పర్యావరణాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేట్టింది. మానవుని మనుగడకు అవసరమైన వాటిలో ముఖ్యమైనవి చెట్లు. కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసుకొని మానవునికి ప్రాణ వాయువు ఆక్సిజన్‌ను వదిలే చెట్ల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటేలా ప్రోత్సహించనున్నారు. వచ్చే నెలలో రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. తెలంగాణకు హరితహారం పేరిట అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2015 జులై 3న హైదరాబాద్‌లోని చిలుకూరు బాలాజీ దేవాలయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. తెలంగాణ భూభాగంలో 33 శాతం చెట్లు ఉండేలా 230 కోట్ల మొక్కలు నాటి పచ్చ దనం పెంచాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. తెలంగాణలో కొత్తగా కొలువు దీరిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హరితహారం పేరును మార్చి వన మహోత్సవం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 10వ విడత మొక్కలు నాటడానికి అంతా సిద్ధం చేశారు. ఈ క్రమంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వెల్గటూర్ ఉమ్మడి మండలంలోని 30 గ్రామ పంచాయితీలలో 30 నర్సరీలలో మొక్కలు పెంచుతున్నారు.

● ఉమ్మడి మండలంలో 2.87 లక్షలు మొక్కలు లక్ష్యం

ఉమ్మడి మండలంలోని 30 గ్రామ పంచాయతీల పరిధిలో 30 నర్సరీలలో వివి రకాలకు చెందిన సుమారు 3 లక్షల మొక్కలు పెంచుతున్నట్లు ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఏపీవో అనిల్ తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా ఉమ్మడి మండల వ్యాప్తంగా 2.87 లక్షలు మొక్కలు నాటడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో మొక్కలు నాటేందుకు ఉపాధి హామీ కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు. నర్సరీలలో అడవి జాతి మొక్కలు, పూలు, పండ్ల మొక్కలు పెంచుతున్నారు.



నర్సరీలో పెంచుతున్న మొక్కలు

వేప, కానుగ, గుల్ మెహర్, సీమ తంగేడు, అడవి తంగేడు, చైనా బాదం వంటి మొక్కలతో పాటు దానిమ్మ, నిమ్మ, ఉసిరి, మునగ, గులాబి, మల్లె, గన్నేరు, మందారం వంటి మొక్కలు పెంచుతున్నారు. మునగ, వెదురు వంటి మొక్కలు ఎక్కువగా పెంచుతున్నారు. 10వ విడత వన మహోత్సవంలో మొక్కలు నాటడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు.

● పంపిణీకి మొక్కలు సిద్ధం

వివిధ రకాల పూల, పండ్ల మొక్కలు గ్రామాలలో ఇంటింటికీ పంపిణీ చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. గతంలో ఇంటింటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేసినప్పటికీ కొందరు వాటిని నాటలేదని దృష్టికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈసారి ఖచ్చితంగా మొక్కలు నాటేలా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, రోడ్ల వెంట, గట్టుల ప్రాంతంలో మొక్కలు నాటనున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీకి లక్ష్యం విధించి నిర్ణీత సమయంలో మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు.



మొక్కలు నాటడానికి గుంతలు తవ్వుతున్న ఉపాధిహామీ కూలీలు

● పంపిణీకి మొక్కలు సిద్ధం

రవీందర్‌రెడ్డి ఎంపీడీవో



పదవ విడతలో వన మహోత్సవంలో భాగంగా నాటడానికి వీలుగా మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రా గానే మొక్కలు పంపిణీ చేస్తాం. ఉమ్మడి మండల వ్యాప్తంగా 2.87 లక్షల మొక్కలు నాటాలని ఉన్నతాధికారులు లక్ష్యం నిర్దేశిం చారు. లక్ష్య సాధనకు ప్రణాళికలు సిద్ధం చేశాము. గ్రామాలలో మొక్కలు నాటడానికి వీలుగా ఉపాధి హామీ కూలీలతో గుంతలు తవ్విస్తున్నాం. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడానికి చర్యలు చేపడతాం.

ప్రజాస్వామ్యానికి చీకటి రోజు ఎమర్జెన్సీ

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి
- నల్లబ్యాడ్జీలతో నిరసన

జగిత్యాల అర్బన్, జూన్ 25: దేశంలో ప్రవేశపెట్టిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికే చీకటి రోజు అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి ప్రవీణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక కమల నిలయంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు, ప్రజల జీవన విధానం, ఆంక్షల గురించి కార్యకర్తలకు వివరించారు. అనంతరం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఏకపక్ష ధోరణితో 21 నెలల పాటు ఎమర్జెన్సీని విధించారన్నారు. ఈ ఘటన ప్రజాస్వామ్యానికే చీకటి రోజుగా ఆమె అభివర్ణించారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య దేశాలకు సరైనవి కావన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తాము ఈ నిరసనను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బాధ్యులు రంగు గోపాల్, జుంబర్తి దివాకర్, నలువాల తిరుపతి, ఆముద రాజు, పవన్‌సింగ్, గాదాసు రాజేందర్, మ్యాకల లక్ష్మీ, మల్లీశ్వరీ, గడ్డల లక్ష్మీ, భానుప్రియ, మధురిమ, కవిత, లావణ్య, మంజుల, రాజ్‌గోపాల్, శ్రీకాంత్, రాము తదితరులున్నారు.

●మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పట్టణంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద భారత సురక్షా సమితి బాధ్యులు మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తన పదవిని కాపాడుకునేందుకు ఎమర్జెన్సీని ఇందిరాగాంధీ విధించిందని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలను జైల్లలో పెట్టి, పత్రికల స్వేచ్ఛను, వాక్ స్వాతంత్ర్యాన్ని హరించేలా ఏకపక్షంగా పాలన సాగించిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు ఏసీఎస్ రాజు, సత్యనారాయణ, కాశీనాథం, సింగం గంగాధర్, వేముల పోచమల్లు, శ్రీనివాస్, సుధాకర్ తదితరులున్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

'సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి'

జగిత్యాల టౌన్, జూన్ 25 :సైబర్ మోసాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, ఏఏ విధులు నిర్వహిస్తున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ డయల్ 100 కాల్స్‌కి తక్షనమే స్పందించి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ మరింత పెంచి దొంగతనాలు జరుగకుండా అరికట్టాలన్నారు. డీఎస్పీ రఘు చందర్, సీఐ వేణు గోపాల్ తదితరులు ఉన్నారు.

గోపాలమిత్ర సర్వీస్‌సెంటర్ వినియోగంలోకి తీసుకురావాలి

కొడిమ్యాల, జూన్ 25 : మండలంలోని నల్లగొండ గ్రామంలో నిరుపయోగంగా ఉన్న గోపాలమిత్ర సర్వీస్ సెంటర్‌ను (వెటర్నరీభవనం)వినియోగంలోకి తీసుకరావాలని కోరుతూ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారికి మంగళవారం ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం సుమారు తొమ్మిదేఏళ్ల క్రితం నాబార్డు నిధులు 7 లక్షల 50 వేల రూపాయలతో భవనాన్ని నిర్మింపచేసిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. నల్లగొండ పరిసర గ్రామాల పశువులకు చికిత్స చేయాలిసిన వారు ఎవ్వరు కూడ అందుబాటులో ఉండటం లేదని పేర్కొన్నారు. పశువులు వ్యాధి బారిన పడ్డప్పుడు పశువుల యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అధికారులు నల్లగొండ గోపాలమిత్ర భవనం ఉపయోగంలోకి తీసుకరావాలని వినతి పత్రంలో కోరారు.

భూవివాదంపై ఫిర్యాదు

మల్యాల, జూన్ 25: మండలంలోని బల్వంతాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిని కాసారపు శ్రీనివాస్ అనే వ్యక్తికి కొన్నేళ్ల క్రితం కేటాయించగా ఇటీవల కొందరు దానిపై వివాదం సృష్టిస్తున్నరంటూ తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మడుగుల మల్లన్న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్‌పై కొందరు తప్పుడు కేసులు పెట్టాలనే యోచన చేస్తున్నారని మానుకోవాలని పేర్కొన్నారు. విచారణ జరిపి హద్దులు నిర్ణయించాలని అధికారులను కోరారు. కాగ వివాదం నెలకొన్న స్థలం పరిశీలించి శ్రీనివాస్‌కు న్యాయం చేయలన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెగడపల్లి, జూన్ 25: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య సిబ్బంది పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పెగడపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో మంగళవారం మండల వైద్యారోగ్య సిబ్బంది ఇల్లిల్లూ తిరుగుతూ జ్వర సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వాతావరణంలో మార్పులు, వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం పోటీలు

కోరుట్ల రూరల్, జూన్ 25 : తెలంగాణ క్రీడా పాఠశాల 2024-2025 సంవత్సరానికి గాను నాలుగో తరగ తిలో ప్రవేశం పొందడానికి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో నరేశం మంగళవారం తెలిపారు. ఈ నెల 27న కోరుట్ల పట్టణంలోని కాలేజీ గ్రౌండ్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏఈవో తెలిపారు. ఇందుకుగాను తేదీ 01-09-2015 నుంచి 31-08-2016 మధ్యన బాల బాలికలు జన్మించి ఉండి ఆధార్ కార్డు జన్మ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా మూడవ తరగతి మార్కుల పట్టిక, బోనోఫైడ్ సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోల కలిగి ఉండాలని తెలిపారు. వివరాలకు 9948765002 ఆశోక్, 9951518737 విజయ్ కుమార్ నంబర్లకు సంప్రదిం చాలని తెలిపారు.

బుగ్గారం వాసికి డాక్టరేట్

బుగ్గారం జూన్ 25: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ కళాకారుడు, శ్రీ గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ నక్క రాజును గౌరవ డాక్టరేట్ దక్కింది. విద్యా, ఆధ్యాత్మిక, కళా, సామాజిక సేవరంగంలో ఆయన చేసిన కృషికి గానూ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సోమవారం అవార్డును ప్రకటించింది. జూలై 13వ తేదిన హైద్రాబాద్‌లోని సరస్వతీ పరిషత్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నట్లు నిర్వహకులు తెలిపారు. బుగ్గారం మండలానికి చెందిన పలువురు నాయకులు, ప్రజా ప్రతి నిధులు రాజుకు డాక్టరేట్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నీటి నిల్వలతో రోగాలు విజృంభణ

కథలాపూర్, జూన్ 25 : ఇళ్ల వద్ద కుండలు, టైర్లు, సిమెంట్ గోళాల్లో నీటిని నిల్వ చేయడం వల్ల రోగాలు విజృంభిస్తాయని వైద్యాధికారిణి సింధూజ, సూపర్ వైజర్ నాగభూషణం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తక్కళ్లపల్లి, సిరికొండ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగు పరిచే కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఇళ్లల్లో ఎవరికైనా జ్వరాలు ఉన్నాయా అని సర్వే చేసి వారి వివరాలను నమోదు చేసుకున్నారు. నీరు నిల్వ ఉంటే దోమల బెడద తీవ్రమై మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వస్తాయని ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు నర్సారెడ్డి, పూజిత, గఫూర్, కారోబార్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

పది రోజులైనా పట్టించుకోరా?

● కాలిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేయని విద్యుత్ అధికారులు

కథలాపూర్, జూన్ 25 : ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు రైతన్న సమాయాత్తమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ మోటర్లకు విద్యుత్ సరఫరా తప్పనిసరి. కాగా మండలంలోని భూషణరావుపేటలో బూరుగు గడ్డ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పది రోజులు అవుతున్నా ఎన్‌పీడీసీఎల్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. నార్లు పోసుకోగా ప్రస్తుతం నీరు అవసరమని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని అంబటి రవి, జగ్గారావు, బత్తిని మహేశ్ అనే రైతులు ఆరోపిస్తున్నారు. గీతకార్మికులు ఈత వనంకు నీరు పడుతుండగా నీళ్ళు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతు నేస్తం కార్యక్రమం పై వీసీ సమావేశం

గొల్లపల్లి, జూన్ 25 : గొల్లపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమం పై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రైతులతో వీసీ సమావేశంను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను అడి గితెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని రాపల్లె గ్రామానికి చెందిన వీరబత్తిని సత్యానారాయణ గౌడ్ అనే రైతు మాట్లాడుతూ రైతుభరోసా పథకంను పది ఎకరాల లోపు రైతులకు ఏలాంటి షరతులు లేకుండా ఇవ్వాలని, రూ. 2 లక్షల రుణ మాఫీ పథకంను ఏలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని, రాయితీపై వ్యవసాయ పరికరాలను, ఎరువులు, విత్తనాలను రైతులకు అందజేయాలని మంత్రిని కోరారు. అలాగే ఉపాధి హామీ కూలీలను వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని మంత్రికి వీసీ ద్వారా విజ్ఞప్తి చేశారు. ధర్మపురి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రాంచందర్, వ్యవసాయ అధికారులు, కరుణ, షాహీద్ అలీ, ఏఈవోలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వైభవంగా సంకటహర చతుర్థి పూజలు

ధర్మపురి, జూన్ 25: ధర్మపురి శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గణపతి ఆలయంలో లోక కళ్యాణార్థం గణనాథుడికి వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్, స్థానిక వేదపండితులు మధు రామశర్మ శాస్త్రోక్తంగా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూజలు, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, మాజీ ధర్మకర్త గునిశెట్టి రవీందర్, అర్చకులు పాల్గొన్నారు.



వినాయకుడికి పూజలు చేస్తున్న అర్చకులు

అధికారుల సహకారంతో అభివృద్ధి చేశాం

మండల సమావేశంలో సభ్యులు

ధర్మపురి, జూన్ 25: తమ పదవీ కాలంలో అధికారుల సహకారంతో గ్రామాలను ఎంతో అభివృద్ధి చేసినట్లు నేరెళ్ల, తిమ్మాపూర్ ఎంపీటీసీలు రెడ్డవేని సత్యం కాళ్ల సత్తయ్య, జైనా పీఏసీఎస్ చైర్మన్ సౌళ్ల నరేష్ తెలిపారు. ధర్మపురి మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించగా ముఖ్య అతిథిగా జడ్పీటీసీ బత్తిని అరుణ హాజరయ్యారు. ఈ సమావేశం ప్రారంభంలో వ్యవసాయ శాఖ పనుల గురించి మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ ప్రస్తావించారు. ప్రస్తుతం రైతులకు విత్తనాల పంపిణీ, వరి ధాన్యం సేకరణ కొనుగోలు, మూడు నెలల్లో వివిధ బ్యాంకుల ద్వారా రైతులకు అందించిన రైతు బీమా, విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆయన తెలిపారు. పశువైద్య శాఖ పక్షాన చేపట్టిన మూడు మాసాలకు చెందిన కార్యక్రమాలు గురించి మండల వెటర్నరీ డాక్టర్ బద్దం రాజేందర్‌రెడ్డి వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ పని తీరు గురించి నేరెళ్ల పీహెచ్‌సీ డాక్టర్ అవంతి ప్రస్తావించారు. విద్యాశాఖ పని తీరు గురించి ఎంఈవో గంగాధర్ వివరించారు. గ్రామీణ నీటి సరఫరా, మిషన్ భగీరథ కింద గ్రామాల్లో తాగు నీటి సరఫరా సక్రమంగా అందించినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ వివేకానంద తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన జీపీ భవనాలు, హెల్త్ సబ్‌సెంటర్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్మాణ పనులు గురించి పీఆర్ ఏఈఈ ముకరం ప్రస్తావించారు. వైద్య శాఖ పని తీరు గురించి ప్రస్తావిస్తూ గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందిన కనెక్షన్లు, కొత్త సబ్ స్టేషన్లు పనులు ప్రారంభించినట్లు ట్రాన్స్‌కో ఏఈఈ రవి తెలిపారు. లబ్ధిదారుల పేర్లతో చెప్పాలని జడ్పీటీసీ బత్తిని అరుణ, తిమ్మాపూర్ ఎంపీటీసీ కాళ్ల సత్తయ్య, జైనా పీఏసీఎస్ సౌళ్ల నరేష్ కోరారు. ఐకేపీ ఏపీఎం రమాదేవి, ఈజీఎస్ ఏపీవో సుజన్, ఎంపీవో నరేష్‌కుమార్, వీరయ్య, ఐసీడీఎస్ ప్రగతి గురించి సూపర్‌వైజర్లు కుసుమ, విజయ పలు విషయాలు లేవనెత్తారు. ఇదిలా ఉండగా ఎంఈవో బత్తుల భూమయ్య మృతి పట్ల సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రవీందర్, పీఆర్ డీఈఈ లక్ష్మణ్‌రావు, ఎంపీవో నరేష్‌కుమార్, వైస్ ఎంపీపీ గడ్డం మహిపాల్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు కైసర్ అహ్మద్, ఎంటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబును సన్మానిస్తున్న సభ్యులు

అధికారులు, ఎంపీటీసీలు సహకరించారు

ఎంపీపీ చిట్టిబాబు, జడ్పీటీసీ అరుణ

గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అధికారులు, ఎంపీటీసీలు ఎంతో సహకరించారని ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ బత్తిని అరుణ అన్నారు. మండల పరిషత్ సర్వ సభ్య ఆఖరి సమావేశం సందర్భంగా మంగళవారం వారు మాట్లాడారు. తమ ఐదేళ్ల పదవీ కాలంలో పార్టీలకతీతంగా ప్రజాప్రతిని ధులైన ఎంపీటీసీలు అందరు కలిసికట్టుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పదవీ కాలం ముగుస్తున్న సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీలను ఎంపీటీసీలు శాలువా కప్పి సన్మానం చేసి మెమెంటోలు అందించారు. అలాగే ఎంపీటీసీలను కూడ ఎంపీపీ, జడ్పీటీసీలు సన్మానించారు.